నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మధుయాష్కి గౌడ్

ఎల్‌బీనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని.. మెట్రోను అటు ఎయిర్ పోర్టుకు, ఇటు హయత్‌నగర్ వరకు విస్తరిస్తుందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి తో కలిసి హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం, అగ్రికల్చర్ కాలనీలలో మధుయాష్కి గౌడ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికలలో ఎంపీగా గెలిపించినట్లు గానే సునీత మహేందర్ రెడ్డి కూడా గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ ఇతర మౌలిక సదుపాయాలను తాము కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, ముద్దగోని రామ్మోహన్ గౌడ్, కార్పొరేటర్లు సుజాతానాయక్ పాల్గొన్నారు.



హస్తినాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మధుయాష్కిగౌడ్, మల్‌రెడ్డి రామ్‌రెడ్డి

సంక్షేమ సంఘాల నాయకులతో ఈటల ఆత్మీయ సమావేశం



గడ్డిఅన్నారంలో కాలనీ సంక్షేమ సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఈటల రాజేందర్

చైతన్యపురి: గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. నేతాజీ నగర్ కాలనీలో శ్రీసాయి గార్డెన్స్‌లో జరిగిన సమావేశంలో ఈటల మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి రావటం వందకు వంద శాతం ఖాయం అన్నారు. మల్కాజ్‌గిరి అభివృద్ధికి నేరుగా ప్రధాని నరేంద్రమోదితో మాట్లాడి నిధులు మంజూరు చేయించే సత్తా తనకే ఉందన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, వివిధ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

మలక్‌పేట: హైదరాబాద్ పార్లమెంట్ నియోజవర్గంలో కాషాయం జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు ధీమా వ్యక్తం చేశారు. మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారంలో ఏర్పాటు చేసిన పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఆదివారం రాత్రి ఆయన ప్రారంభించారు. పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాసం వెంకటేశ్వర్లు

ఓటరు స్లిప్పుల పంపిణీ

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సెక్టార్ అధికారి గుర్రం ఇంద్రాసేనారెడ్డి కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలంలోని కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ, కప్పపహాడ్, తులేకలాన్, ఎల్మినేడు తదితర గ్రామాల్లో ఓటరు ఐడెంటిఫికేషన్ స్లిప్పులను సిబ్బంది పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సెక్టార్ అధికారి గుర్రం ఇంద్రాసేనారెడ్డి పర్యవేక్షించారు. ఓటర్ల పేర్లు, క్రమ సంఖ్య, గుర్తింపు నంబర్లు సరిగా ఉన్నాయా లేదా సరి చూసుకోవాలని సూచించారు. స్లిప్పులు పంపిణీలో నిర్లక్ష్యంగా చేస్తే సహించేది లేదన్నారు. పంచాయతీ కార్యదర్శులు రవీందర్, సాయికుమార్, బూత్ అధికారులు పాల్గొన్నారు.

ఓటు వేయండి..

తుర్కయంజాల్: ఓటుహక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ లోక్‌సభ ఎన్నికల్లో ఓటేయాలని మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణ రెడ్డి కోరారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి మునగనూర్‌లో ఆయన బీఎల్‌లతో కలిసి ఇంటింటికి తిరిగి ఓటర్ స్లిప్‌ల పంపిణీని చేపట్టారు. ఇంటింటికి స్లిప్‌లను పంపిణీ చేస్తున్నామని.. చేరనివారు బీఎల్‌ఓలను సంప్రదించాలని సూచించారు.

ఆదిబట్ల మున్సిపాలిటీలో

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని 9వ వార్డులో ఆయన సిబ్బందితో కలిసి ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు. జూన్ 13వ తేదీన జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. మేనేజర్ శ్రీనివాస్, బూత్ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

యాచారం మండలంలో..

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను సోమవారం మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సందర్శించారు. పోలింగ్ స్టేషన్లల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఓటర్లకు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు.

బీర్ల ప్రియులకు షాక్

- వైన్స్‌ల్లో చల్లటి లైట్ బీర్లు దొరకడం లేదు
- స్టాక్ వచ్చిన గంటల వ్యవధిలోనే ఖాళీ..
- వైన్స్ దుకాణాల వద్ద నో స్టాక్ బోర్డులు
- ఎండలు, లోకల్ పండగలు వల్లే కొరత



మద్యం దుకాణంలో బీర్లు

మహేశ్వరం: వేసవి కాలంలో చల్లటి బీరు తాగాలని ఆశించే మద్యం ప్రియులకు బీర్లు దొరకడం కష్టంగా మారుతోంది. ఇప్పటికే మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ఉన్న వైన్స్ షాపులకు, మద్యం డిపోలకు బీర్ల సరఫరా చాలా వరకు నిలిచిపోయింది. వచ్చిన కొద్దిపాటి నిల్వలను ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వైన్స్‌లకు రేషియో పద్ధతిన సరఫరా చేస్తోంది. కొద్ది రోజుల్లో బీర్ల కొత మరింత తీవ్రం కానున్నట్లు తెలుస్తోంది. గతంలో పలు కంపెనీలు ప్రభుత్వ లిక్కర్ గోదాంలకు సరఫరా చేసిన బీరు నిల్వలకు బకాయిల చెల్లింపులో జాప్యమే కొరతకు కారణమని తెలుస్తోంది. మహేశ్వరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 13 వైన్స్ దుకాణాలు, మూడు బార్లు ఉన్నాయి. వేసవిలో పెద్ద ఎత్తున బీర్ల అమ్మకాలు జరుగుతాయి. గత ఏడాది 2023 ఏప్రిల్ నెలలో 24 వేల బీరు కేసుల విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది 2024 ఏప్రిల్ నెలలో 28 వేల కేసుల బీర్ల విక్రయాలు జరిగాయి. మే నెలలో భారీగా విక్రయాలు జరుగుతాయంటున్నారు. గత ఏడాది బీరు కేసులు మద్యం దుకాణాల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా జరిగి డిపోల్లో వేల కేసులు నిల్వలు ఉండేవి. ఇప్పుడు బీరు కేసులు వచ్చినవి వచ్చినట్లు విక్రయిస్తుండగా డిపోలో నిల్వలు ఉండడం లేదు. ఈ లెక్కన డిమాండ్‌కు తగ్గ బీర్ల సరఫరా చేయడం లేదు.

ఎండల ఎఫెక్ట్..

బీర్ల కొరతకు ప్రధాన కారణం పెళ్లిళ్లు, విందులు, ఎండలు తీవ్రంగా కొట్టడం, గ్రామాల్లో గ్రామ దేవతల పండుగలు, బొడ్రాయి, విగ్రహ ప్రతిష్ఠ, బోనాల జాతరలు ఎక్కువగా ఏప్రిల్ నెలలో ఉండడంతో అధిక సంఖ్యలో బీర్లను కొనుగోలు చేశారు. గత సంవత్సరంలో పోలిస్తే ఈ సంవత్సరం వేసవిలో బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. కొన్ని వైన్స్‌ల్లో బీర్లు కొన్ని గంటల వ్యవధిలోనే అయిపోతున్నాయి. బీర్లు లేకపోవడంతో లిక్కర్ కొనుగోలు చేస్తున్నారు. దీంతో బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగి కొరత ఏర్పడిందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఎక్కువగా వైన్స్‌ల్లో కింగ్ ఫిషర్ లైట్, బడ్వయిజర్, కరోనా, గ్రీన్, రాయల్ చాలెంజర్ బీరు, ఇతర లైట్ బీర్ల కొరత తీవ్రంగా ఉంది. బీర్లు అయిపోగానే మద్యం డిపోలకు ఆర్డర్ పెడుతున్నాం. మే నెలలో విపరీతంగా ఎండలు ఉంటాయి.. దీంతో బీర్ల కొరత మరింతగా ఉంటుంది.

బిల్లులు పెండింగ్‌లో..

లిక్కర్ తయారీ కంపెనీల నుంచి ప్రభుత్వం వివిధ బ్రాండ్లకు సంబంధించి బీర్లు కొనుగోలు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం డిపోలకు సరఫరా చేస్తోంది. అక్కడి నుంచి రిటైల్ దుకాణాలకు సరఫ రా జరుగుతుంది. లిక్కర్ తయారీ కంపెనీలు సరఫరా చేసిన మద్యం బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కొన్ని డిస్టిలరీస్, బ్రేవరేజేస్ మద్యం ఉత్పత్తి తగ్గించడంతో పాటు బీరు నిల్వల సరఫరా చాలా వరకు తగ్గించేశాయి. మార్చి నుంచి మే నెల వరకు కోట్లల్లో బీర్ల అమ్మకాలు జరుగుతాయి.

> **అమ్మకాలు విపరీతంగా పెరిగాయి**
>
> ఎండల అధికంగా ఉండటం, పెళ్లీలు, విందులు, లోకల్ పండుగలు, ఉండడంతో బీర్ల అమ్మకాలు బాగా జరిగాయి. దీంతో బీర్ల కొరత ఏర్పడింది. గత సంవత్సరం కంటే ప్రస్తుతం ఎక్కువ అమ్మకాలు జరిగాయి. వైన్స్‌ల్లో గ్రౌండ్ స్టాక్ నిల్వలు ఉండడం లేదు. మే నెలలో మరింత కొరత ఏర్పడే అవకాశం ఉంది. ప్రతి రోజు వైన్స్‌ల నుంచి అమ్మకాల వివరాలు సేకరించి బీర్ల కోసం మద్యం డిపోలకు ఆర్డర్లు పెడుతున్నాం.
>
> – తిరుపతిరెడ్డి– ఎక్సైజ్ సీఐ, మహేశ్వరం

నిఘా నేత్రం... సమస్తం నిక్షిప్తం

360 డిగ్రీల కెమెరాలతో పర్యవేక్షణ



ఎల్‌బీనగర్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేసింది. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేదుకు సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. నగదు మద్యం ఇతర వస్తువులు పంపిణీకి అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటికే బృందాలను ఏర్పాటు చేసింది. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో నిఘా బృందాలు తనిఖీలు చేస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రవేశపెట్టిన 360 డిగ్రీల కోణంలో కెమరాల విధాన్ని పార్లమెంటు ఎన్నికల్లో వినియోగిస్తున్నారు.

రాష్ట్ర కార్యాలయానికి అనుసంధానం...

నిఘా బృందాల వాహనాలకు 360 డిగ్రీల కెమెరాలను బిగించారు. అధునికి సాంకేతిక పరిజ్ఞానంతో వీటిని రూపొందించారు. ప్రతి నియోజకవర్గంలో తనిఖీ బృందాలను ఈ వాహనాలను ఏర్పాటు చేశారు. వీటికి జియోట్యాగింగ్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర జిల్లా ఎన్నికల కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ఆయా నియోజకవర్గంలో జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు వీక్షిస్తారు.

బృందాల ఏర్పాటు

ఎల్‌బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 9 ప్రత్యేక నిఘా బృందాలు పని చేస్తున్నాయి.పోలీస్, గెజిటెడ్ అధికారితో పాటు ఒక వీడియో గ్రాఫర్ ఉంటారు. ఈ నిఘా బృందాలు మూడు షిఫ్టుల్లో పనిచేస్తాయి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరిగినా, మద్యం ఇతర పంపకాలు జరిగినా వెంటనే సమాచారం అందుకుని అక్కడకు వెళ్లి అడ్డుకట్టు వేసేందుకు చర్యలు తీసుకుంటారు. వీడియో సర్వైలెన్స్ బృందం ద్వారా వచ్చిన వీడియోలను వ్యూయింగ్ బృందం సభ్యులు నిశితంగా పరిశీస్తారు. మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ బృందంలో గెజిటెడ్ అధికారితో పాటు పోలీసు , వీడియో గ్రాఫర్ ఉంటారు. నియమావళి, ఉల్లంఘన, అభ్యర్థుల ప్రచారం ఖర్చులపై వీరు నిఘాపెడతారు.

రాకేష్‌భవానీకి ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న రాకేష్ భవానీ

హయత్‌నగర్: హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ చింతల రాకేష్‌భవానీకి స్పందన ఈదా ఇంటర్నేషనల్ వారు 2024 ఉగాది ఉత్తమ సేవా పురస్కారం అందించారు. ఆదివారం రాత్రి నగరంలోని బేగంపేట్ ప్లాజా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు ఆకెళ్ళ రాఘవేంద్ర, ప్రముఖ టెన్నిస్ కోచ్ గణేష్ రామన్‌ల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మన్సూరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ నాగోలు డివిజన్ మహిళా అధ్యక్షురాలు ప్రమీల, ఉపాధ్యక్షురాలు గౌరీ, ప్రధాన కార్యదర్శి భారతిల ఆధ్వర్యంలో పలువురు మహిళలు మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎల్‌బీనగర్‌లోని పార్టీ ఎన్నికల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్నం సునీత మహేందర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.


అమ్మవారి ఆలయ హుండీ చోరీకి యత్నం

నాగోలు: రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయ సేవా సదన్ భవనం సమీపంలోని అమ్మవారి ఆలయ హుండీని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసేందుకు యత్నించారు. ఈ సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆలయ హుండీ పగిలిపోయిందని, తాళం తెరిచి కింద పడి పోయి ఉండటాన్ని కోర్టులో పనిచేసే వాచ్‌మన్ కళావతి కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి దృష్టి తీసుకువచ్చింది. దీంతో జిల్లా కోర్టు సిబ్బంది పరిశీలించి ఎల్‌బీనగర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాగోలు: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన మేరకు.. ఎల్‌బీనగర్ డీవీఎం కాలేజ్ సమీపంలో గుర్తు తెలియని (50) వయస్సు గల వ్యక్తి కింద పడిపోయి మృతి చెందినట్లు స్థానికులు గమనించి ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన వ్యక్తిని పరిశీలించగా అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

వైభవంగా షిరిడీ సాయిబాబా ఆలయ రజతోత్సవాలు



ఉప్పల్: ఉప్పల్ ధర్మపురి కాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయ రజతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రెండో రోజు ప్రత్యేక హోమాలు, 1001 కలశ పూజ నిర్వహించారు. కళశాలతో చివరి రోజు మంగళవారం స్వామి వారికి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదానం నిర్వహిస్తున్నారు.

ఘనంగా తిరుకల్యాణ మహోత్సవం

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ శ్రీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం శ్రీ వారి తిరు కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస చార్యులు, చైతన్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించగా కాలనీ అధ్యక్షులు జగన్‌రెడ్డి ఇంటి నుండి డప్పు వాయిద్యల మధ్య స్వామి వారి తలంబ్రాలు తీసుకొచ్చారు. మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి, రోడ్ల అబివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వామి వారి తిరు కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మన్సూరాబాద్: భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధితో సుభిక్షంగా ఉండాలంటే నరేంద్రమోదీ మళ్లీ ప్రధానమంత్రి కావాలని మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ చంద్రపురి కాలనీ సీనియర్ సిటిజన్ భవనం ఆవరణంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో మాట– ముచ్చట కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తోందన్నారు. దేశంలోని దీర్ఘకాలికంగా ఉన్న ప్రధాన సమస్యలను నరేంద్రమోదీ చాలా చాకచక్యంతో పరిష్కరించారని గుర్తుచేశారు.

సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



ప్రచారంలో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డి

నాగోలు: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు కాంగ్రెస్ పార్టీతో సాధ్యమని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి అన్నారు. పీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో నాగోలు డివిజన్ అధ్యక్షురాలు మంజుల రెడ్డి ఆధ్వర్యంలో నాగోలు డివిజన్‌లో శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో పట్నం సునీత మహేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జైపురికాలనీ, ఫత్తులాగూడ, సర్వేనెంబర్ 58, ఇతర కాలనీలో పాద యాత్ర నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గ సీనియర్ నాయకులు, ముద్దగాని రామ్మోహన్ గౌడ్, జోగు రాములు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- ఏసీపీ కేపీవీ రాజు
- ఖానాపూర్‌లో పోలీసుల కవాతు



ఖానాపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో పోలీసులు నిర్వహించిన కవాతులో ఏసీపీ కేపీవీ రాజు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జూన్ 13న జరగబోయే లోక్‌సభ ఎన్నికలు శాంతియుత వాతవరణంలో నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవలన్నారు. ఓటువేయాలంటూ అభ్యర్థులెవరైనా ప్రలోభాలాకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ సత్యనారయణ, ఎస్ఐలు మారయ్య, మైబెల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

చేవెళ్లలో కాంగ్రెస్ విజయం ఖాయం

పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత

మహేశ్వరం: చేవెళ్ల పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీ దేవేందర్ నగర్ కాలనీ 1వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ పలువురు కార్యకర్తలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, రావిర్యాల మాజీ సర్పంచ్ బోద జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకోస్తామన్నారు. గతంలో కొంతమంది కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొంది అధికారం కోసం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే ప్రజాపాలన సాధ్యమవుతుందన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనునిత్యం ప్రజల కోసం పని చేసే రంజిత్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలను గుర్తు పట్టని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలన్నారు. మతతత్వ పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లోకి స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ జెండాలను మెడలో వేసి ఆహ్వానించారు.

నేడు డయల్ యువర్ డీఎం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 ఆర్‌టీసీ డిపో నుంచి నడిచే బస్ సర్వీసులకు సంబంధించి ప్రయాణికుల నుంచి సలహాలు, సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపోమేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ్, జూకల్, కొల్లాపూర్, విజయవాడ, బైలడిల్లా, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ వెళ్లే బస్సులు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణీకులు నేరుగా డీఎంతో మాట్లాడవచ్చన్నారు. 9959226249 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

నేడు ఎన్టీఆర్ నగర్‌లో సీఎం కార్నర్ మీటింగ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా మంగళవారం రామకృష్ణాపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో జరిగే కార్నర్ మీటింగ్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని, సీనియర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆర్‌కేపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సీఎం పాల్గొనే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ప్రచారం



ఎన్టీఆర్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్‌కే మహమ్మద్

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్‌కే మహమ్మద్ అన్నారు. సోమవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో ఎన్టీఆర్‌నగర్ ఫేజ్ 1లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలిపించాలి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌస్‌పాషా, ఇస్మాయిల్, జాంగిర్ అహ్మద్, పటేల్, శ్రీశైలం, కవిత, సంతోష, శిరిషా, మాధవి, లావణ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 32, బీర 35, క్యాలీ ఫ్లవర్ 18, క్యాబేజీ 15, క్యారెట్ 31. దొండ 31, ఆలు 33, ఉల్లి 19, గోకర 28, దోస 16, సొర 9, పొట్ల 13, అరటి 9, చిక్కుడు 50, అర్వి 35, మునగ 23, చిలగడదుంప 70, బీట్‌రూట్ 19, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 80, క్యాప్సికమ్ 60. ఈధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకండి

దిల్‌సుఖ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బండి మధుసూదన్ రావు కోరారు. ఆర్‌కేపురం , సరూర్‌నగర్ డివిజన్ విజయపురి కాలనీలో సోమవారం చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ బండి మధుసూదన్ రావు, గట్ల రవీంద్ర ఆధ్వర్యంలో గడప గడపకు పాదయాత్ర చేస్తూ భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పున్నా గణేష్ నేత, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు గట్ల రవీంద్ర, యాదవరెడ్డి పాల్గొన్నారు.

సొంత గూటికి ఓరుగంటి వెంకటేశం గౌడ్



మధుయాష్కీ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఓరుగంటి వెంకటేశంగౌడ్

చంపాపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు పరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చటం వల్లే తాను బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు చంపాపేట డివిజన్ ఉదయ్‌నగర్ కాలనీకి చెందిన రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశం గౌడ్ అన్నారు. సోమవారం ఆయన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా మధుయాష్కీ...వెంకటేశం గౌడ్‌కు పార్టీ కండువ కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మధుయాష్కీగౌడ్, బీసీ జేఏసీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కబేలాకు తరలిస్తున్న గోవుల పట్టివేత

ఉప్పల్: గోవులను కబేలాకు తరలిస్తున్న వ్యక్తులను తెలంగాణ గో రక్షక్ నేతలు బండారు పవన్ కుమార్ తదితరులు సోమవారం ఉప్పల్ గాంధీ బొమ్మ వద్ద అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 30 ఎద్దులు, 10 లేగ దూడలు, గోవులను స్వాధీనం చేసుకుని గోషామహల్ గోశాలకు తరలించారు. నల్గొండ జిల్లా మాల్ ప్రాంతానికి చెందిన శ్రీను అనే వ్యక్తి కంటైనర్‌లో బహదూర్‌పుర కబేలాకు వాటిని తరలిస్తున్నట్లు అంగీకరించాడు. గోవులను అక్రమ రవాణా చేస్తున్న శ్రీను, వాహన డ్రైవర్ రమావత్ మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్ తెలిపారు.

ఆస్తిపన్నుపై ఐదుశాతం రాయితీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఈనెల 30వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లిస్తే రాయితీ వర్తిస్తుందని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం ఆదిబట్ల మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి గాను ఆస్తి పన్నును రేపటిలోపు చెల్లిస్తే 5శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు. సీడీఎంఏ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో లేదంటే సంబంధిత బిల్ కలెక్టర్ దగ్గర పన్ను చెల్లించవచ్చన్నారు. ఈ అవకాశాన్ని మున్సిపల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.